# మినీకథ



# ది బెట్

భని

క్లాలేజి అయిపోయిం తరువాత బస్ కోసం స్టాప్‌లో వెయిట్ చేస్తూ నుంచుంది గీత.

"చూడండి మిస్" వినవచ్చిన వైపు చూసింది.

"నాపేరు రాజు" ఏమిటన్నట్టు చూసింది గీత.

"మీ పేరు గీత కదా?" అడిగాడు. అవునన్నట్టు తలూపింది చికాకుగా.

"మీ యిల్లెక్కడండి?" ప్రశ్నించాడు. భ్రుకుటి ముడిచి కోపంగా చూసింది.

"అబ్బే.... ఉత్తినే అడిగానండి. నేను నా ఫ్రెండ్స్‌తో బెట్ కట్టేను మిమ్మల్ని మాట్లాడిస్తానని. మిమ్మల్ని ఎవరు మాట్లాడించినా కసురుకుంటారని. తిడతారని అన్నారు. నేను వాళ్ళతో బెట్ కట్టేను మిమ్మల్ని మాట్లాడించి మీ చేత తిట్లు తిన కుండా వస్తానని. అంతేగాని....మీరేం అనుకోకండి" సంజాయిషి యిచ్చాడు రాజు.

"అలాగే.... ఏం అనుకోనులెండి" అందీసారి చిరునవ్వుతో.

ఆ తరువాత ఏదేదో మాట్లాడేడు. అన్నిటికీ ఊఁకొడుతూ నుంచుంది గీత. కొంచెం సేపటికి దూరంగా బస్ రావడం కనిపించింది. రాజువైపుతిరిగి చెప్పింది.

"మీరే గెలిచారనిచెప్పండి మీఫ్రెండ్స్‌తో. అదిగో బస్ వస్తుంది. వస్తాను." తనూ వస్తానని చెప్పి తన ఫ్రెండ్స్ నించున్న చోటికి వెళ్ళిపోయాడు రాజు. గీత బస్ ఎక్కడానికి బస్‌వైపు నడిచింది.

"నాతో ఎలా మాట్లాడిందో చూశారా? దాని పొగరు ఎలా అణచాలో నాకు తెలుసురా. చూస్తుండండి. దాన్ని ఎలా బుట్టలో వేస్తానో" అంతా గొల్లున నవ్వేరు. రవి తన ఫ్రెండ్స్‌తో అంటున్న మాటలు గీత చెవిని దాటిపోలేదు.

బస్సులో కూర్చున్న తరువాత అనుకుంది మనసులో 'నీ పొగరు ఎలా అణచాలో నాకు తెలుసులేరా' అని.

కిటికీలోంచి బయటికి చూస్తున్న గీతకి చెయ్యూపేడు రాజు.

గీత కొత్తగా వచ్చి డిగ్రీలో జాయిన్ అయింది ఆ కాలేజీలో. చేరిన కొద్ది రోజులకే మంచి ధైర్యవంతురాలని పేరొచ్చింది. మొగపిల్లలు ఆడపిల్లల్ని ఏడిపించడానికొస్తే తనే వాళ్ళని ఏడిపించి అక్కడినించి పారిపోయేలా చేస్తుంది. గీత ఉంటే ఆడ పిల్లలందరు చాలా ధైర్యంగా ఉంటారు. మిగతాప్పుడు ఎవరైనా ఏమైనా అన్నా తలొంచుకుని వెళ్ళిపోతారు. సాధారణంగా గీత వుంటే ఆ గుంపువాళ్ళని ఏం అనరు. ఒకవేళ ఏమైనాఅన్నా గీత వాళ్ళకి బుద్ధిచెప్తుంది వాళ్ళ జోకులు వాళ్ళకే తిప్పికొట్టి. దాంతో గీతకి 'రౌడీ రంగమ్మ', 'పొగరుబోతు', 'తల బిరుసు' లాంటి బిరుదులిచ్చారు.

రాజు కూడా ఏం తక్కువవాడు కాదు. చూసిన ప్రతి ఆడపిల్లనీ ఏడిపిస్తాడు. అమ్మాయిలని వర్ణిస్తూంటే అబ్బాయిలందరు నవ్వుతుంటే గర్వంగా ఫీలౌతాడు. అమ్మాయిలు సిగ్గుతో చచ్చిపోతూ అక్కడినించి పరుగులాంటి నడకతో పారిపోతారు.

మర్నాడు కాలేజి గేట్ దాటి ముందుకు నడుస్తోంది గీత తన ఫ్రెండ్సందరితో కలసి.

"గీత గారు...." అంటూ పిలుస్తూ గబగబా నడుచుకుంటూ వచ్చేడురాజు. వెనక్కి తిరిగి చూసింది గీత. రాజు చేతిలో పొడుగైన కాడ, రెండు ఆకులు వున్న గులాబి మొగ్గ వుంది. కొంచెం దూరంలో రాజు ఫ్రెండ్సందరూ నించున్నారు.

"యిది మీ కోసం తెచ్చానండి" అన్నాడు పువ్వుని చూపిస్తూ. చెయ్యి ముందికి చాపాడు తీసుకోమన్నట్టు.

"థాంక్సండి" అంది తీసుకుంటూ. చేతి వేళ్ళు తగిలిస్తూ యిచ్చాడు రాజు.

"యిది యిస్తానని బెట్ కట్టారాండి?" అడిగింది. అవునన్నట్టు తలూపేడురాజు.

"నేనుకూడా మా ఫ్రెండ్స్‌తో బెట్ కట్టానండి". ఎందుకు అని అడగకుండానే మళ్ళీ చెప్పింది. "ఈసారిఅనక మీరు నా దగ్గరకొస్తే చెంపమీద ఒక్కటిస్తానని. పోయినసారి మీరు గెలిచారుకదండి. ఈసారి నేను గెలుస్తానేం?" అంటూ ముందుకొక్కడుగువేసి చెయ్యెత్తి చెళ్ళుమనిపించింది రాజు చెంపని.

రెండో చేతిలో ఉన్న పువ్వుని రాజు చేతిలో బలంగా పెట్టింది. పువ్వుక్రిందున్న ముల్లు గ్రుచ్చుకుని "స్స్...." అన్నాడు రాజు.

ఆడపిల్లలందరూ గొల్లున నవ్వుతుంటే చేత్తో బుగ్గరాసుకుంటూ బిక్కమొహం వేసుకుని నించున్న రాజుకి చెయ్యూపుతూ తన ఫ్రెండ్స్‌తో నవ్వుకుంటూ ముందుకు సాగిపోయింది గీత.